నేడు నగర పంచాయతీ ప్రథమ వార్షిక సమావేశం

ప్రజాశక్తి - ఆకివీడు

నగర పంచాయతీ నూతన పాలకవర్గం ఏర్పడి సంవత్సర కాలమైనందున మంగళవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సంవత్సర కాలంలో కౌన్సిల్ సాధించిన ప్రగతి, చేపట్టిన అభివృద్ధి చేపట్టిన ఇతర కార్యక్రమాలను చర్చిస్తారని తెలిపారు.

ఆశలు.. అడియాశలు

రూ.3300 వేల కోట్లు తప్ప ఇతర అంశాల ఊసే లేదు

వశిష్ట వారధి నిర్మాణానికి చర్యలు : ముఖ్యమంత్రి జగన్

లింకు రోడ్లు, శ్మశానవాటికల ఏర్పాటుకు సహకరించాలి : ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

సిపిఎం, ఫుడ్‌పార్కు ఉద్యమ నేతలపై విరుచుకుపడ్డ పోలీసులు

పలుచోట్ల బిజెపి నేతల గృహనిర్బంధం



అగ్రికల్చర్ కంపెనీ భూముల పత్రాలను రైతులకు అందిస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి - భీమవరం, నరసాపురం టౌన్

భీమవరం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాడ్డక ముఖ్యమంత్రి జగన్ తొలిసారి నరసపాపురం పర్యటనకు విచ్చేశారు. ఈ పర్యటనపై జిల్లా ప్రజానీకం పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలుగానే మిగిలిపోయాయి. ముఖ్యమంత్రి పర్యటన నరసాపురం నియోజకవర్గానికే పరిమితమైంది. కనీసం నూతన జిల్లా అభివృద్ధికి ఎటువంటి ప్రకటనా సిఎం చేయకపోవడంపై జనంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

నరసాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి జగన్ సోమవారం పర్యటించారు. ఆయన హెలికాప్టర్‌లో ఉదయం 11.04 నిమిషాలకు నరసాపురం మండలం చినమామిడిపల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, హోం మంత్రి తానేటి వనిత, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్ ప్రశాంతితోపాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఏలు సిఎంకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో జగన్ దారి పొడవునా అభివాదం చేసుకుంటూ రుస్తుంబాదలో ఏర్పాటు చేసిన సభ ప్రాంగణానికి 11.54 నిమిషాలకు చేరుకున్నారు. అక్కడి నుంచి రూ.4.80 కోట్లతో నిర్మించిన బస్సు కాంప్లెక్స్, రూ.11 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి బటన్ నొక్కి ప్రారంభించారు. రూ.332 కోట్లతో నిర్మించనున్న ఆక్వా యూనివర్సిటీ, రూ.429 కోట్లతో నిర్మించనున్న బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్, రూ.1400 కోట్లతో నిర్మించనున్న వాటర్ గ్రిడ్‌తోపాటు మొత్తం రూ.3300 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. 12.37 నిమిషాలకు వేదికపైకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ ముందుగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ లర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవ సభలో కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభోపన్యాసం చేశారు. సుస్థిర అభివృద్ధి, అవసరమైన నైపుణ్యాలు, ఉద్యోగ కల్పనకు రూ.3300 కోట్లతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. ఆక్వా యూనివర్శిటీ, ఫిషింగ్ హార్బర్, వాటర్ గ్రిడ్ వంటివి నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా బస్సు కాంప్లెక్స్ ఆధునీకరణ, వంద పడకల ఆసుపత్రి నిర్మించుకోవడం ఆనందదాయకమన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎంఎల్ఏ ముదునూరి ప్రసాదరాజు, ముఖ్యమంత్రి జగన్ సభలో మాట్లాడుతూ కలెక్టర్ ప్రస్తావించిన అంశాలనే పదేపదే ప్రస్తావించారు. 36 నిమిషాలపాటు ప్రసంగించిన సిఎం సమయం అంతా నరసాపురం నియోజకవర్గ అభివృద్ధి, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కోసమే మాట్లాడారు. వివిధ పథకాల నిధుల విడుదలకు బటన్ నొక్కిన తర్వాత సభికుల్లో కదలిక వచ్చింది. అయితే ముఖ్యమంత్రి పర్యటన కొత్త జిల్లా కేంద్రంతోపాటు జిల్లా సమగ్రాభివృద్ధికి దోహదపడుతుందని అంతా ఆశించినప్పటికీ దానికి అవకాశం లేకుండాపోయింది.

వశిష్ట వారధిపై వంతెన నిర్మాణానికి చర్యలు : సిఎం జగన్

ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నంగా ఉన్న వశిష్ట వారధిపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో వంతెన నిర్మాణానికి సంబంధించిన పనులకు టెండర్లు పిలుస్తున్నామన్నారు. పట్టణంలో రూ.13 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని జాతికి అంకితం చేస్తున్నామన్నారు. రాష్ట్రానికి తలమానికంగా ఆక్వా విశ్వ విద్యాలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. దేశంలో తమిళనాడు, కేరళ మినహా ఎక్కడా ఆక్వా యూనివర్శిటీలు లేవన్నారు. ఆక్వా సాగు వల్ల తాగు నీరు కలుషితమైందని, పూర్వపు పశ్చిమ, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల ప్రజలకు రక్షిత నీటిని అందించేందుకు రూ.1400 కోట్లతో వాటర్ గ్రిడ్ నిర్మించనున్నామన్నారు. ముఖ్యంగా మత్స్యకారుల కోసం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అగ్రికల్చర్ కంపెనీ భూముల బిజులను రద్దు చేస్తున్నామని చెప్పారు. సుమారు 1754 ఎకరాలకు సంబంధించి 1623 మంది రైతులకు పూర్తి హక్కును కల్పిస్తు రిజిస్ట్రేషన్ పత్రాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబం పొందిన లబ్ధిని కొలమానంగా తీసుకొని రాబోయే రోజుల్లో వైసిపికి అండగా నిలవాలని కోరారు.

లింకు రోడ్లు, శ్మశానవాటికల ఏర్పాటుకు సహకరించాలి : ప్రభుత్వ విప్ ప్రసాదరాజు

అభివృద్ధిలో వందేళ్ల వెనక్కి ఉన్న నరసాపురం నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి జగన్ రాకతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎంఎల్‌ఏ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బహిరంగ సభలో ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రధాన సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. జిల్లాల పునర్విభజనలో జిల్లా కేంద్రంగా నరసాపురాన్ని ప్రకటించాలని ముఖ్యమంత్రి జగన్‌ను కోరానని, అయితే రాష్ట్ర అభివృద్ధి వికేంద్రీకరణలో తన వెంట ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారని గుర్తు చేశారు. నాడు మాటిచ్చిన ముఖ్యమంత్రి నియోజకవర్గ అభివృద్ధికి రూ.3300 కోట్లు నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రధాన సమస్యలన్నీ పరిష్కారమయ్యాయని, లింకు రోడ్లు, శ్మశానవాటికల ఏర్పాటు వంటి వాటికి సహకరించాలని ముఖ్యమంత్రిని కోరారు. అనంతరం ముమ్మిడివరం ఒఎన్‌జిసి పైప్‌లైన్ ఏర్పాటులో బాధిత 23450 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.107.90 కోట్లు వారి ఖాతాలకు జమ చేశారు. దీనికి సంబంధించిన నమూనా చెక్కును బాధితులకు అందించారు. అలాగే అగ్రికల్చర్ కంపెనీ భూముల రైతులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. మత్స్యకారుల సాంప్రదాయ వస్తువులైన వలకట్టు, చేటిబుట్ట, చేప నమూనా బొమ్మను ముఖ్యమంత్రి జగన్‌కు అందించి ఘనంగా సత్కరించారు.

జిల్లావ్యాప్తంగా బిజెపి నాయకుల అరెస్టు

జగన్ పర్యటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బిజెపి నాయకులను ఒకరోజు ముందుగానే అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భీమవరం, పాలకొల్లు, నరసాపురం వంటి ప్రధాన ప్రాంతాల్లో బిజెపి ముఖ్య నాయకులను అరెస్టు చేశారు. దీనిపై బిజెపి తీవ్ర విమర్శలుచేసింది. సమాజంలో నిరసన తెలుపుకునే హక్కు అందరికీ ఉంటుందని, వైసిపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ప్రయత్నించడం దుర్మార్గమని విమర్శించారు.

మత్స్యకారుల అభ్యున్నతికి జగన్ కృషి మత్స్యశాఖ మత్రి సిదిరి అప్పలరాజు

మత్స్యకారుల అభ్యున్నతికి సిఎం జగన్ చేస్తున్న కృషి అభినందనీయమని మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతికి ప్రధానంగా రూ.10 వేల ఆర్థిక సాయం, రూ.తొమ్మిది డీజిల్‌పై రాయితీ, ప్రమాదవశాత్తూ మత్స్యకారులు చనిపోతే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నెల్లూరు, బాపట్ల, కృష్ణా, కాకినాడ జిల్లాల్లో ఫిషింగ్ హార్బర్ల పనులు జరుగుతున్నాయని, తాజాగా బియ్యపుతిప్పలో ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు.

అడుగడుగునా ఆంక్షలు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నరసాపురం పట్టణమంతా అడుగడుగునా ఆంక్షలు విధించారు. రోడ్లకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేయడంతో స్థానికంగా నివాసం ఉంటున్నవారికి ఇబ్బందులు తప్పలేదు. ముఖ్యంగా ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాలకొల్లు బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. బహిరంగ సభా ప్రాంగణం పట్టణానికి దూరంగా ఉండడంతో జనాలను తరలించడానికి కష్టాలు వెంటాడాయి. ముఖ్యంగా సభా వేదిక వద్ద మీడియాపైనా తీవ్ర ఆంక్షలు విధించారు. ఎటువంటి ఫోటోలు తీయకూడదని నిబంధన విధించడం గమనార్హం.

ప్రభుత్వ దమనకాండపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

తుందుర్రు ఆక్వా మెగా ఫుడ్ పార్క్‌కు వ్యతిరేకంగా చేసిన ఉద్యమాల సందర్భంగా తమపై బనాయించిన కేసులు ఎత్తివేయాలని సిఎం జగన్మోహన్‌రెడ్డికి విన్నవించుకునేందుకు వెళ్తే పోలీసులు అత్యంత క్రూరంగా బూట్లతో తన్నుతూ, పిడి గుద్దులతో దాడికి పాల్పడటం దారుణమని సిపిఎం నాయకులు పొగాకు పూర్ణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సిఎం పర్యటన సందర్భంగా సభకు రమ్మని ఆహ్వానించి ఇలా పోలీసులతో దాడి చేయించడం సిగ్గుచేటని విమర్శించారు. శాంతియుతంగా సభలో పాల్గొనడానికి వెళ్తున్న తమపై తాడేపల్లిగూడెం సిఐ నాగరాజు కక్షపూరితంగా దుర్భాషలాడుతూ పిడుగులు గుద్ది, బూట్లతో తన్నుతూ చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. మహిళా నేతలని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో తమ గుండెలపై గుద్ది పైశాచికత్వం ప్రదర్శించారని విమర్శించారు. సదరు సిఐపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరో నేత ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ నాడు ప్రతిపక్ష నేతగా ఆక్వా ఫుడ్ పార్క్ బాధితులను పరామర్శించడానికి వచ్చిన జగన్ మన ప్రభుత్వం వచ్చాక ఫుడ్‌పార్క్‌ను బంగాళాఖాతంలో కలిపేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బాధిత గ్రామాల ప్రజలపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని చెప్పి విస్మరించారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు న్యాయం చేస్తానని చెబుతున్న ముఖ్యమంత్రి మత్స్యకారుల జీవితాలను నాశనం చేస్తున్న గోదావరి మెగా ఫుడ్‌పార్క్‌ను ఎందుకు బంగాళాఖాతంలో కలపలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఫుడ్ పార్క్‌ను గ్రామాల మధ్య నుంచి తరలించి బాధిత గ్రామాల ప్రజలపై ఉన్న కేసులను ఎత్తివేయాలన్నారు. లేనిపక్షంలో ఆయా గ్రామాల ప్రజలతో మళ్లీ ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు.

నినదిస్తున్న సిపిఎం, ఫుడ్‌పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ నేతలు

పోలీసుల తీరు సరికాదు: సిపిఎం

నరసాపురం: ముఖ్యమంత్రి జగన్ పర్యటన నేపథంలో సభాస్థలి వద్ద పోలీసుల తీరుపై సిపిఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం, కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం పెద్దఎత్తున పోలీసు బలగాలను రంగంలోకి దింపడంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. నిరసన తెలిపేందుకు సభాస్థలికి వచ్చిన తుందుర్రు ఆక్వా ఫుడ్ పార్కు వ్యతిరేక పోరాట కమిటీ నేతలను అదుపులోకి తీసుకునే సమయంలో పోలీసుల తీరు అత్యంత అమానుషంగా, అమానవీయంగా ఉందని పేర్కొన్నారు. మహిళలు అని కూడా కనీస మర్యాద లేకుండా ఫుడ్‌పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ నేత ఆరేటి సత్యవతి, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణలను పురుష పోలీసులు దుర్భాషలాడుతూ బలవంతంగా వ్యాన్ ఎక్కించడం ప్రభుత్వ దమనకాండకు అద్దం పడుతోందని విమర్శించారు. ఉద్యమ నేత ముచ్చర్ల త్రిమూర్తులు, వైసిపికి చెందిన కొయ్యే సంపత్‌రావులను తీవ్ర స్థాయిలో కొట్టడాన్ని ఖండించారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ దమనకాండ తీరు అత్యంత దుర్మార్గంగా ఉందని విమర్శించారు. జగన్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు.

భీమవరం రూరల్: సిఎం జగన్ పర్యటన నేపథ్యంలో ఆక్వా రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుత నిరసన తెలపడానికి సిద్ధమైన తమను అడ్డుకోవడం దారుణమని బిజెపి రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. తనతో పాటు తమ నేతలు పాకా సత్యనారాయణ, అల్లూరి సాయి దుర్గరాజు, పేరిచర్ల సుభాష్, కాయిత సురేంద్రలను భీమవరం పోలీసులు ఆదివారం రాత్రి నుంచి గృహ నిర్బంధం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడకక్కడ సమస్యలు పేరుకుని ఉండగా కేంద్ర ప్రభుత్వ పథకాలతో సిఎం శంకుస్థాపనలు చేయడం హాస్యాస్పదమని విమర్శించారు.

తెలుగు యువత నేత అడ్డగింత

ఉండి: తెలుగు యువత ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడును నరసాపురంలో పోలీసులు అడ్డుకున్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ హరినాయుడు నరసాపురంలో సిఎం వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తుండగా అడ్డుకున్నారు. పోలీసుల తీరును, ప్రభుత్వ తీరును హరినాయుడు ఖండించారు.

నల్ల చున్నీల తొలగింపు వివాదాస్పదం

సిఎం జగన్ సభకు విచ్చేసిన యువతుల్లో నల్ల చున్నీ ధరించి ఉంటే వారిని పోలీసులు అడ్డుకుని బలవంతంగా వాటిని తీయించి ఒకచోట పడేయడం వివాదాస్పదమైంది. సిఎం జగన్‌కు నిరసన తెలుపుతారనే ఆందోళనతో ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే పాస్‌లున్న వారిని సైతం బలవంతంగా సభాప్రాంగణం నుంచి లాక్కెళ్లడం, నల్ల వస్త్రాలు ఎక్కడా కానరాకుండా జాగ్రత్త పడటం చర్చనీయాంశమైంది.

రైతుల గుండెల్లో వాయుగండం..!

పూర్తికాని మాసూళ్లు - మారిన వాతావరణంతో ఉరుకులు పరుగులు

బరకాలు కప్పి ధాన్యాన్ని రక్షించుకునే ప్రయత్నంలో రైతు

ప్రజాశక్తి - ఆచంట

వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు, ఆకాశం మేఘావృతమై తుపర్లు పడుతుండటంతో రైతులు గుండెల్లో గుబులు నెలకొంది. చేతికొచ్చిన పంట ఎక్కడ చేజారిపోతుందోనని రైతులకు కంటిమీద కునుకు కరువైంది. మండలంలో 11,350 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అయితే మండలంలో 10 శాతం మాత్రమే వరి కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఆచంట, కొడమంచిలి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం తదితర గ్రామాల్లో కోతలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సార్వా సాగుకు భారీగా పెట్టుబడులు పెట్టి రైతుల పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. సార్వా ప్రారంభమైన నాటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. నారుమడుల సందర్భాల్లో ఒకసారి, నాట్ల సమయంలో రెండుసార్లు, వరదల నేపథ్యంలో మరోసారి రైతులు అనేక కష్టనష్టాలకు గురయ్యారు. తీరా పంట చేతికొచ్చిన సమయంలో తుఫాను రావడంతో రైతులు పొలాల వైపు పరుగులు తీస్తున్నారు. ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతోపాటు ధాన్యం అమ్ముడుకాని పరిస్థితి ఉంటుందని రైతులు లబోదిబోమంటున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ఆందోళన

ప్రజాశక్తి - పెంటపాడు

నినదిస్తున్న రైతు నేతలు

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన పంట కళ్లాల వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పంట చేతికొచ్చి పది రోజులైనా ధాన్యం రోడ్లపైనే ఉందన్నారు. వాయుగుండం ప్రభావంతో చిరుజల్లులు పడుతున్నాయని, దీంతో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని అన్నారు. ధాన్యం వెంటనే కొనుగోలు చేయడంతోపాటు వెనువెంటనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, మండల అధ్యక్షులు కరక వెంకటరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, నేతలు మీసాల శ్రీనువాస్, సుర్ల ఏసు, గన్నాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ ఆస్తుల విక్రయం దారుణం

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వినతిపత్రం అందిస్తున్న నేతలు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ ఆస్తులను విభజించి, విక్రయించాలని చూస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు విమర్శించారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బిఎస్ఎన్ఎల్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించి అనంతరం డిఇకి వినతిపత్రం సమర్పించారు. ధర్నానుద్దేశించి నాగేశ్వరరావుతోపాటు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతా ప్రసాద్, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సహా మరో నాలుగు రాష్ట్రాల్లోని బిఎస్ఎన్ఎల్ ఆస్తుల వేలానికి ప్రకటన చేసిందన్నారు. దీంతో ప్రభుత్వరంగ టెలికాం కంపెనీ ఆస్తులను ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టనుందని వారు తెలిపారు. ఆస్తుల నగదీకరణలో భాగంగా వీటిని అమ్మేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిందని విమర్శించారు. మన రాష్ట్రంలోని తాడేపల్లిగూడెం, కొండపల్లిలోని ఆస్తులను అమ్మకాల జాబితాలో చేర్చడాన్ని ఖండించారు. ఐదు రాష్ట్రాల్లో బిఎస్ఎన్ఎల్ ఆస్తుల విలువ రూ.20,160 కోట్లుగా ఉంటుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్టుమెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) అంచనా వేసిందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బిఎస్ఎన్ఎల్‌ను ఆదుకుంటామంటూనే కేంద్రం ఈ చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. 2019లో మోడీ ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ సంస్థలకు రూ.69 వేల కోట్ల ఆర్థిక మద్దతు అందిస్తామని ప్రకటించి, నేడు మరోవైపు ఈ ఆస్తులు అమ్మకానికి చేపట్టడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.నాగేశ్వరరావు, జె.శ్రీను, ఎస్.శేషుబాబు, పి.శ్రీను, గోపయ్య, నాగరాజు, సత్యనారాయణరాజు, సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, పి.రమణ, టి.శ్రీనివాస్, ఆర్‌వి.నాగేంద్ర, పి.నాగేంద్రబాబు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు పెరగాలి

అంతర్జాతీయ ఆహార నిపుణులు డాక్టర్ ఖాదర్ వలీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్



ఖాదర్ వలీని సత్కరిస్తున్న ప్రముఖులు

దేశవ్యాప్తంగా చిరుధాన్యాల సాగు రానున్న రోజుల్లో పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంతర్జాతీయ ఆహార నిపుణులు, కృషిరత్న అవార్డుగ్రహీత డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చిరుధాన్యాలు-పోషక విలువలు- ఆహారం అనే అంశంపై ఆయన ఉపన్యసించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఖాదర్‌వలీ మాట్లాడుతూ చిరుధాన్యాల్లో కొర్రలు, ఊదలు, అరికలు, సామలు, అండు కొర్రలు, సజ్జలు, రాగులు, పరిగల్లు, జొన్నలు, మొక్కజొన్నలను ఆహారంగా ఉపయోగించుకోవాలని సూచించారు. వీటి సాగుకు వర్షాధారం సరిపోతుందని, ఎటువంటి రసాయనాలు, సేంద్రియ పద్ధతులు కూడా అవసరం ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికంగా ఉపయోగిస్తున్న వరి, గోధుమ కూడా ఆరోగ్యానికి అంత మంచిది కాదన్నారు. ప్రపంచవ్యాప్తంగా చిరుధాన్యాల ప్రాధాన్యత బాగా పెరుగుతుందని తెలిపారు. కర్ణాటకలో తాను ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ చిరుధాన్యాల ప్రాధాన్యతను ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీనిపై స్పందించిన ప్రధాని ఐక్యరాజ్యసమితిని ఒప్పించి 2023ను చిరుధాన్యాల ఏడాదిగా ప్రకటించేలా చేసేందుకు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, మిల్లెట్స్ రాంబాబు, డాక్టర్ పిబి ప్రతాప్ కుమార్, హైదరాబాద్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయం ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎంఎస్.సుబ్రహ్మణ్యంరాజు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ బిహెచ్‌విఎల్.లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం తరపున ఉపాధ్యక్షులు రంగరాజు, ప్రిన్సిపల్ జగపతిరాజు డాక్టర్ ఖాదరవలీని ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ దుర్మరణం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ దర్మరణం పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడేనికి చెందిన తెల్లం రామకృష్ణ(51) నరసాపురంలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఇంటికి వచ్చిన ఆదివారం కన్నాపురంలోని పోలవరం రోడ్‌లో ఉన్న పెట్రోల్‌బంక్‌లో తన ద్విచక్ర వాహనానికి పెట్రోల్ కొట్టించుకుని రోడ్డు ఎక్కుతుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రామకృష్ణను రాజమండ్రి ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఎస్ఐ జిజె.విష్ణువర్ధన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిసి సంక్షేమ సంఘం ఉండి నియోజకవర్గ అధ్యక్షునిగా శివకుమార్

ప్రజాశక్తి - కాళ్ల

బిసి సంక్షేమ సంఘం ఉండి నియోజకవర్గ అధ్యక్షునిగా జువ్వలపాలెం మాజీ సర్పంచి కోడేటి శివకుమార్ నియమితులయ్యారు. జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని శివకుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా జువ్వలపాలెంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్ ఆధ్వర్యంలో భీమవరం మార్కెట్ యార్డులో జరిగిన బిసి కులాల కార్తీక వనసమారాధనలో ఈ నియామకం జరిగిందన్నారు. తనను ఉండి నియోజకవర్గ అధ్యక్షునిగా నియమించిన జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. జువ్వలపాలెం శివకుమార్‌ను పలువురు బిసి సంఘం నాయకులు అభినందించారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న శివకుమార్

సిఎం దృష్టికి విద్యుత్ శాఖ ఉద్యోగుల సమస్యలు

ప్రజాశక్తి - నరసాపురం

విద్యుత్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్‌ని దశల వారీగా పర్మినెంట్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కామన సంజయ్ విజ్ఞప్తి చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి సోమవారం నరసాపురంలో పర్యటన సందర్భంగా యునైటెడ్‌బ్యూ యుహెచ్ - 176 (సిఐటియు అనుబంధం) యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను స్థానిక ఎంఎల్‌ఎ, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజాసంకల్ప పాదయాత్రలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీని ఈ సందర్భంగా సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసాపురం డివిజన్ అధ్యక్షులు జి.రామసుందరం, యూనియన్ నాయకులు లీలా కృష్ణ, గోపాల్, లింగరాజు, పెద్దిరాజు, లోకేష్, కోటి, సత్తిరాజు, శేఖర్, శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.

సగర కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - కాళ్ల

సిఎం జగన్మోహన్ రెడ్డి సగర కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని (టిడిపి) సగర సాధికార నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ కావలి వెంకట్రావు కోరారు. పెదఅమిరం గ్రామంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలైనా ఇప్పటివరకు సగర కార్పొరేషన్‌కు ఒక్క లోన్ కూడా మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్మోహన్ రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు.

మాచిరి వచ్చేవరకు ధాన్యాన్ని ఆరబెట్టాలి

ప్రజాశక్తి - పెనుగొండ

వరి కోత అయిన వెంటనే మాచిరి వచ్చేవరకు ధాన్యాన్ని ఆరబెట్టాలని పెనుగొండ వ్యవసాయాధికారి స్పందన అన్నారు. మండలంలోని ములపర్రులో స్థానిక రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో ఆమె రైతుల వద్ద నుంచి ధాన్యం మాచిరి శాంపిల్ తీసుకున్నారు. రైతులకు సంచులు ఇచ్చినట్లు గ్రామ వ్యవసాయ అధికారి సంధ్య తెలిపారు.

అక్రమ అరెస్టులతో పోరాటం ఆగదు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆకివీడు

ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా యువత సమస్యలపై పోరాటం ఆగదని డివైఎఫ్ఐ నినదించింది. ప్రభుత్వం ప్రకటించిన క్రీడా మైదానాల ప్రయివేటీకరణను నిరసిస్తూ డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం విజయవాడలో శాప్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో డివైఎఫ్ఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి గెదేల ధనుష్ పాల్గొని మాట్లాడారు. ఈ విషయాలను సాయంత్రం స్థానిక విలేకరులకు తెలిపారు. నిత్యం యువజన సమస్యలపై పోరాడుతున్న డివైఎఫ్ఐ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని జిల్లా అధ్యక్షులు ధనుష్ ఖండించారని తెలిపారు. క్రీడా మైదానాలు ప్రయివేట్ పరం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పే అండ్ ప్లే విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే క్రీడాకారులను ఒకచోట సంఘటిత పరిచి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాము, జి.రామన్న, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఇలపర్రు సొసైటీ చైర్‌పర్సన్‌గా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని ఇలపర్రు సొసైటీ చైర్‌పర్సన్‌గా వేండ్ర వెంకటేశ్వరరావు, డైరెక్టర్‌గా చిన్నం శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.వెంకటేశ్వరరావు, సర్పంచి దండు పద్మావతి, మాజీ సర్పంచి భీముడు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌ను అభినందిస్తున్న వక్తలు

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోలులో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపిడిఒ మురళీ గంగాధరరావు హామీ ఇచ్చారు. శృంగవృక్షంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఎంపిడిఒ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు సార్వా ధాన్యం కొనుగోలు సందర్భంగా ఎదురవుతున్న ఇబ్బందులను, గోనె సంచుల సమస్యను ఎంపిడిఒ దృష్టికి తీసుకువచ్చారు. స్థానికంగా పండిన ధాన్యాన్ని శృంగ వృక్షంలోని రైసుమిల్లులకు తరలించేలా అనుమతి ఇవ్వాలని ఎంపిడిఒను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సూరిబాబు, ఉప సర్పంచి కలిదిండి ఆనందరాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడమే టిడిపి లక్ష్యమని ఆ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. స్థానిక ఒకటో వార్డులో అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన వట్టి పులుసు సత్యనారాయణ కుటుంబాన్ని బాబ్జి సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ ఇంటి నిర్మాణ సమయంలో తన వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

వికలాంగులకు పేరిచర్ల ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వికలాంగులకు, వృద్ధులకు సహకారం అందించడం అందరి బాధ్యత అని పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు. స్థానిక రామారావుపేటలోని శ్రీ బృందావనంలో సోమవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు వికలాంగ కుమారుడు గల గొర్ల మహేష్, కృష్ణవేణి దంపతులకు డైమండ్స్ లయన్స్ క్లబ్ తరపున బియ్యం, నిత్యావసరాలు, వస్త్రాలు, కూరగాయలు అందించారు. ఈ కార్యక్రమంలో భవిత స్కూల్ ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, డైమండ్స్ సభ్యులు కుందుం వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి రెడ్డి రాజు, వశిష్ట లియో క్లబ్ సభ్యులు మాధురి, అమృత పాల్గొన్నారు.

జనాలను భయపెట్టి సభకు తరలించారు : జనసేన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నరసాపురం నియోజకవర్గ పర్యటనలో జనసేన పార్టీపై ఆయన చేసిన వ్యాఖ్యలను నరసాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి, పిఎసి సభ్యులు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ ఛైర్మన్ బొమ్మిడి నాయకర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు నాయకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి పర్యటనలో లేని నిబంధనలు జగన్ పర్యటనలో అమలు చేశారన్నారు. వాలంటీర్లు ప్రజలని భయపెట్టి సభకు తరలించారన్నారు. అధ్వాన్నంగా ఉన్న రోడ్లను పట్టించుకోకుండా ముఖ్యమంత్రి వెళ్లే రోడ్డు మాత్రం అప్పటికప్పుడు మరమ్మతులు చేసి వదిలేశారని చెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కెవికెలో ప్రపంచ మత్స్య దినోత్సవం

ప్రజాశక్తి - ఉండి

అంతరించిపోతున్న వివిధ రకాల చేపల జాతులను పరిక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉందని కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లికార్జునరావు అన్నారు. సోమవారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. 2015 నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 21వ తేదీన ప్రపంచ మత్స్య దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతిఒక్కరూ నిషేధించాలని ఆయన కోరారు. కెవికె గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ డెబోరా మిస్సియానా మాట్లాడుతూ ప్లాస్టిక్ బదులుగా జనపనార, కాగితాలతో తయారుచేసిన సంచులను ఉపయోగించాలని సూచించారు. డాక్టర్ ఎ.శ్రీనివాస్ మొట్టమొదటిసారిగా ప్రపంచ దినోత్సవం కార్యక్రమాన్ని 21 నవంబర్ 2015న జరిపారని అప్పటినుంచి ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో సహజ వనరుల్లో మత్స్య సంపద వృద్ధి, మత్స్య జాతుల అభివృద్ధి, కాలుష్యం నుంచి మత్స్య జాతుల పరిరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికె సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో రైతు భరోసా కేంద్రాలు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని వల్లూరు గ్రామంలో 690 ఎకరాలకు 560 మంది రైతులు ఉన్నారని, వల్లూరు పంచాయతీ పరిధి గెద్దాడవారిపాలెం పరిధి ఇప్పటివరకు పది ఎకరాల వరకు పంట మాసూలుకొచ్చిందని రైతు భరోసా కేంద్రం ప్రత్యేక అధికారి, ఎంపిడిఒ జగన్నాధరావు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వపరంగా కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని ఆయన తెలిపారు. త్వరలోనే రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని తెలిపారు.

హత్య చేశారంటూ ఆందోళన

మృతదేహంతో రాస్తారోకో

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో పోలీస్ స్టేషన్ పరిధిలో బలుసులగొయ్యిపాలెం పంచాయతీ పరిధిలోని వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన కడలి శ్రీనివాస్‌ది హత్యేనంటూ మృతుని బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సోమవారం శ్రీనివాస్ మృతదేహంతో వీరవాసరం - పెనుమంట్ర ఆర్‌అండ్‌బి మార్గంపై బుదారాయుడు చెరువు వద్ద రాస్తారోకో చేశారు. శ్రీనివాస్ హత్యకు కారకులైన వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని మృతుడు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా మృతుని సామాజిక తరగతికి చెందిన పరిసర గ్రామస్తులు, సంఘం నాయకులు పెద్దఎత్తున చేరుకుని వారికి మద్దతు తెలుపుతూ ఆందోళనలో పాల్గొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభమైన ఆందోళన 11 గంటల వరకు సాగింది. ఈ ఆందోళనతో ఆ మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వీరవాసరం ఎస్ఐ రమేష్ బాధిత తరపు వారికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ వారు ఆందోళన విరమించలేదు. ఎట్టకేలకు నిందితులుగా అనుమానిస్తున్నవారిని అదుపులోకి తీసుకుని, చట్ట ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీ ఇవ్వడంతో, సంఘ పెద్దలు కూడా ఆందోళన కారులకు నచ్చ చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనకు కారణమైన వివరాలను మృతుని బంధువులు, గ్రామస్తులు తెలిపారు. వీరవల్లిపాలెంకు చెందిన కొంతమంది ఈ నెల 13వ తేదీన మొగల్తూరు మండలంలోని పేరుపాలెం బీచ్‌కు వెళ్లారు. వీరితోపాటు శ్రీనివాస్ కూడా వెళ్లారు. అదేరోజు బుదారాయుడుచెరువుకు చెందిన ఏడుగురు యువకుల బృందం కూడా పేరుపాలెం బీచ్‌కు వెళ్లారు. బీచ్‌లో శ్రీనివాస్ స్నానం చేస్తుండగా ఏడుగురు బృందంలోని కొంతమంది వ్యక్తులు శ్రీనివాస్ వద్దకు వచ్చి మరోచోట స్నానం చేద్దామని చెప్పి అక్కడి నుంచి తీసుకెళ్లారు. శ్రీనివాస్ వచ్చిన బృందం స్నానాలు ముగించుకుని శ్రీనివాస్ కోసం ఎదురు చేస్తుండగా ఎంతసేపటికీ రాకపోవడంతో ఒక వ్యక్తి వెతుకుతుండగా ప్రమాదకర స్థితిలో పడి ఉన్న శ్రీనివాస్‌ను గుర్తించారు. సదరు వ్యక్తి శ్రీనివాస్‌ను తీసుకెళ్లిన బృందంలోని వ్యక్తులను ఏమైందని అడుగగా కెరటాల తాకిడికి ప్రమాదానికి గురయ్యాడని, అందుకే గట్టుపైకి తీసుకొచ్చామని చెప్పారు. అదే సమయంలో శ్రీనివాస్‌తో మాట్లాడితే తనను చంపేందుకు ప్రయత్నించారంటూ చెప్పారు. గాయాలపాలైన శ్రీనివాస్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 20వ తేదీన మృతి చెందాడు. శ్రీనివాస్ శరీరంపై గాయాలను బట్టి ఉద్దేశపూర్వకంగానే శ్రీనివాస్‌ను చంపారని, శ్రీనివాస్ పేరుపాలెం వస్తున్న సమాచారం తెలుసుకున్న తరువాతే ఏడుగురు బృందం పేరుపాలెం వచ్చారని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. శ్రీనివాస్‌ను ఉద్దేశపూర్వకంగానే హత్య చేశారని బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మృతుడు గ్యాస్ బండలు అమ్ముకుంటూ జీవించేవాడని, ఇతనికి భార్య ఛాముండేశ్వరి, డిగ్రీ పూర్తయిన ఒక కుమార్తె ఉన్నారు. నిందితులుగా భావిస్తున్నవారితో శ్రీనివాస్‌కు మంచి స్నేహ సంబంధాలున్నాయని, అతనిని హత్య చేయడానికి కారణాలేమిటో పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

రాస్తారోకో చేస్తున్న బంధువులు, గ్రామస్తులు

హత్య కేసుగా మార్పు

మొగల్తూరు : మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కొట్లాట కేసును హత్య కేసుగా మార్పు చేశామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. శ్రీనివాస్ భార్య ఛాముండేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు కొట్లాట కేసు నమోదు చేశామని, శ్రీనివాస్ హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోవడంతో దానిని హత్య కేసుగా మార్పు చేశామని ఎస్ఐ తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

బహుమతులు అందిస్తున్న సత్యఉషారాణి

ప్రజాశక్తి - తణుకు రూరల్

సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేసుకోకుండా, విజ్ఞానాభివృద్ధికి వినియోగించుకోవాలని ఎస్‌కెఎస్‌డి కళాశాల వ్యవస్థాపకులు సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి సూచించారు. స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మానవీయ విలువలు నేర్చుకోవడం, తెలుసుకోవడం, ఆచరించడం విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. విద్య అనేది మార్కులు, ర్యాంకులు కోసం కాదని విద్యార్థికి నైతిక విలువలతో కూడిన జీవిత విధానం నేర్పేదిగా ఉండాలన్నారు. విలువలు కలిగిన మనిషిగా బతకాలని, మర మనిషిగా జీవించకూడదని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు కళాశాల కరస్పాండెంట్ సత్యఉషారాణి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి హరనాథ్, ఉపగ్రంథాలయాధికారి శీల గీతాకుమారి, డి.స్రవంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

ప్రజాశక్తి - ఉండి

గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలని ఉండి ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. సోమవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభను ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ అధికారి జక్కంపూడి వెంకట కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని చెప్పారు. గ్రంథాలయాల్లోని ముఖ్యమైన పుస్తకాలను, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను చదివి ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఎంపిపి శ్రీహరి నారాయణరాజును, పాఠశాల ఉపాధ్యాయులు హనుమంతు వెంకటేశ్వరరావును, విశ్రాంత గ్రంథాలయ అధికారి ముదునూరి మహంకాళిరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉండి లయన్స్ క్లబ్ కార్యదర్శి కలిదిండి సీతారామరాజు, కమతం బెనర్జీ, పాఠశాల ఉపాధ్యాయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ముదునూరి శివరామరాజు, శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరం : వారం రోజుల పాటు నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. పాలకోడేరు, గొల్లలకోడేరు గ్రామాల్లోని గ్రంథాలయాల్లో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలకు బహుమతులను అందించారు. ఈ బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీరామ లక్ష్మణమూర్తి, గొల్లలకోడేరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రామలక్ష్మి, సర్పంచి కుక్కల లక్ష్మి, గ్రంథాలయ పాలకుడు పాల అపర్ణ కుమార్ పాల్గొన్నారు.

బహుమతులతో విద్యార్థులు

జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగనన్న కాలనీలో లబ్ధిదారులకు నిరంతర విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్లు ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మల్లిపూడి శివారు అర్జునుడుపాలెంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కర్రి గోపాలకృష్ణారెడ్డి, పెనుగొండ ఎంపిసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి), వైస్ ఎంపిపి వాసంశెట్టి కిరణ్, వైసిపి నాయకులు గుడిమెట్ల గంగాధర్‌రెడ్డి, దండు రామరాజు, నల్లమిల్లి గోపి, వార్డు సభ్యుడు రొక్కం ముసలయ్య, పుచ్చకాయల శివాజీ రాజు, తహాశీల్దార్ దండు అశోక్ వర్మ పాల్గొన్నారు.


జగనన్న కాలనీకి విద్యుత్ కనెక్షన్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

చట్టాల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థులు సమాజం పట్ల, చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని నెల్లి సతీష్ కుమార్ సూచించారు. దుంపగడప వివిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న 21 రోజులు ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా 13వ రోజు సోమవారం న్యాయ సేవలు ప్రాముఖ్యత చట్టాలపై అవగాహన అంశంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతతో మెలగాలన్నారు. అందుకు అవసరమైన అనేక అంశాలు నేర్చుకోవాలని ఆయన వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

23న ఎస్ఆర్‌కెఆర్ కళాశాలలో వర్క్‌షాప్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 23వ తేదీన భీమవరంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో యూరోపియన్ యూనియన్ శాస్త్రవేత్తలతో, ఐఐటీ నిపుణులతో స్ట్రాటజిక్ ప్లానింగ్ ఫర్ వాటర్ రిసోర్సెస్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ నోబెల్ బయో టెక్నికల్ ట్రీట్‌మెంట్ అండ్ గుడ్ ప్రాక్టీస్ అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ స్ప్రింగ్ ప్రాజెక్ట్ డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఇండియాలోని ఐఐటీతోను యూరోపియన్ దేశాలైన నార్వే, పెన్లాండ్, పోర్చుగల్, హంగేరి, వంటి దేశాలతోను, ఇండియాలోని ఐఐటీలు పలు లేబరేటరీలతో కలిపి స్ప్రింగ్ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వర్క్‌షాపునకు హంగేరి నుంచి డాక్టర్ జార్జ్ చేనిడర్, డాక్టర్ థామస్ కోవాక్స్, పోర్చుగల్ నుంచి డాక్టర్ ఆండ్రీఎఫ్ ఫింటో, ఫిన్లాండ్ నుంచి డాక్టర్ అంటే హెర్లివి, నార్వే నుంచి డాక్టర్ రాజేంద్ర కౌరు కాలే, ఐఐటి గౌహతి నుంచి డాక్టర్ సంజుక్త, ఐఐటి వారణాసి నుంచి డాక్టర్ ప్రభాకర్ కుమార్ సింగ్, ఐఐటి ఖర్గపూర్ నుంచి డాక్టర్ రామకృష్ణ సేన్, ఇంకా దేశం నలుమూలల నుంచి పలువురు శాస్త్రవేత్తలు పరిశోధకులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలిపారు.

విస్సాకోడేరులో కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - పాలకోడేరు

కార్తీక మాసం సందర్భంగా పాలకోడేరు మండల టిడిపి మహిళా మండలి ఆధ్వర్యంలో విస్సాకోడేరు గ్రామంలో సోమవారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి నాగలక్ష్మి, నాగరాజులు ఏర్పాటు చేసిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు (కలవపూడి రాంబాబు) పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, నడిపూడి వెంకట అప్పారావు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు అండలూరి జయలక్ష్మి, కృష్ణ కుమారి, కృష్ణవర్మ, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు దొంగ కృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

నరసాపురంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పాలకొల్లులో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురైంది. జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పెనుగొండల నుంచి నరసాపురాని పాలకొల్లు మీదుగా వెళ్లాలి. ఈ క్రమంలో పలు స్కూల్ బస్సులు, కార్లు పాలకొల్లు మీద నుంచి వెళ్లడంతో పాలకొల్లులో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఇతర ప్రాంతాల ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు.

కళాకారుడు వరప్రసాద్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - ఆకివీడు

ఒక కళాకారుడి మరణం సమాజానికి ఎన్నటికీ తీరని లోటేనని అందునా ఎన్నో రంగాల్లో నిష్ణాతుడైన సమాజ సేవకుడు లేకపోవడం ఎంతో బాధాకరమని పలువురు వక్తలు అన్నారు. ప్రముఖ కవి, రచయిత, రిటైర్డ్ ఆంధ్ర ఉపన్యాసకులు, ప్రముఖ అంతర్జాతీయ హరికథకులు డాక్టర్ కొమ్ము సుబ్రహ్మణ్యవరప్రసాద్ మరణం పట్ల పలువురు తమ సంతాపం తెలిపారు. స్థానిక పతంజలి యోగా ఆరోగ్య కేంద్ర శారదా కళా సమితి ఆధ్వర్యంలో సంతాప సభ సోమవారం నిర్వహించారు. ఈ సభకు సమితి అధ్యక్షులు డాక్టర్ లయన్ ఎంవి.సూర్యనారాయణరాజు అధ్యక్షత వహించారు. ప్రారంభంలో ప్రసాద్ మాస్టారు చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం ఆకివీడు నుంచి అంతర్జాతీయ స్థాయికి ఆకివీడు పేరుని తీసుకువెళ్లిన కళాకారుడు లేకపోవడం దురదృష్టమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం కళా సంస్థ నిర్వాహకులు, ప్రముఖ న్యాయవాది రాయప్రోలు భగవాన్, రేడియో ఆర్టిస్ట్ కవి రచయిత, ఎస్‌టిపికె రాజగోపాలాచారి, సరిగమ సంగీత పరిషత్ అధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావు, కొల్లి వెంకన్న బాబు, కళా సమితి సభ్యులు కెఆర్‌కె.మూర్తిరాజు, వానపల్లి బాబూరావు, డాక్టర్ కె.పద్మావతి, డాక్టర్ ఎఎస్ఎన్.రాజు, నెల్లి సతీష్‌కుమార్, లయన్ దాసరి సత్యనారాయణ, గుర్రం శ్రీనివాసరావు, కంభంపాటి నరసింహమూర్తి, తోట వాసు, వెంకన్న బాబు, ప్రయాగ రామబ్రహ్మశివశర్మ (త్రిమూర్తులు) పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పేదలు రెండు పూటలా తృప్తిగా భోజనం చేసేందుకు అన్నా క్యాంటీన్లు ఎంతో ఉపయోగపడతాయని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు అన్నా క్యాంటీన్ వద్ద సోమవారం ప్రముఖ ఆడిటర్ కలిదిండి రామరాజు 75వ జయంతి సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పీతల శ్రీనివాస్, పాలవలస తులసీరావు, పిసిని రాము, కలిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, నాచుగుంట గ్రామ కాపురస్తురాలు మైన వేల్పూరి సోమరాజు, తండ్రి: వెంకటేష్ అనే నాకు గల పాస్‌పోర్టు నెంబరు **H 8185344** గత నెల 26-10-2022న ఉంగుటూరు నుండి తాడేపల్లిగూడెం ఆటోలో వెళ్తుండగా పాస్‌పోర్టు కలిగిన కవర్ మార్గ మధ్యలో పడిపోయింది. కావున దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

వేల్పూరి సోమరాజు
S/o. వెంకటేష్, హౌస్ నం. 13-299/1
నాచుగుంట, ఉంగుటూరు
ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-పిన్:534411
సెల్: 9951012533

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన **శ్రీ సింహాద్రి నరసింహారావు,** S/o. **రామలింగేశ్వరరావు** కారిచర్లవారి వీధి, తూర్పు వీధి, ఏలూరు - 534001 అను వారు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పాలూరి రవీంద్ర జైపాల్, S/o. లేటు వెంకట్రావు, వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర, పడమర వీధి, ఏలూరు అను వారి దగ్గర నుండి కొనుగోలు చేయుటకు సిద్ధపడినారు. సదరు ఆస్తి కొనుగోలు విషయములో ఎటువంటి లావాదేవీలు ఉన్న ఎడల నా యొక్క దిగువ అడ్రసుకు సంప్రదించవలసినదిగా కోరుచున్నాను. సదరు కొనుగోలు జరిగిన తరువాత ఎటువంటి లావాదేవీలకు నా క్లయింటు బాధ్యుడు కాడు అని ఈ పత్రిక ముఖముగా తెలియజేయుచున్నాను.

షెడ్యూలు ఆస్తి వివరం

ఏలూరు జిల్లా, ఏలూరు సబ్.డి., పాత పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు కార్పొరేషన్, పడమర వీధి, ఎ/2వ వార్డు, ఇప్పటి 17వ డివిజన్‌లోని T.S. No. 1345 దాఖలా తాలూక చ॥గ॥ 79.13/16 ములు లేక 67 చ॥మీ॥ల స్థలము, అందులోని డోరు నెంబరు 3బి-5-9రు అసెస్‌మెంటు నెం. 1075032302 రుగా గల ఆర్‌సిసి బిల్డింగు వగైరా ఆస్తికి హద్దులు.
తూర్పు: రాజవీధి (మునిసిపల్ రోడ్డు) అ. 23.9లు.
దక్షిణం: రవీంద్ర జైపాల్ స్థలము అ. 32.3లు.
పడమర: రవీంద్ర జైపాల్ స్థలము అ. 21.0లు.
ఉత్తరం: రాజవీధి (మునిసిపల్ రోడ్డు) 63.0లు.

శ్రీ అంబుల వెంకట నారాయణ
న్యాయవాది, అగ్రిగోల్డ్ అపార్టుమెంటు సందు
ఏలూరు పత్తేబాద, ఏలూరు
తేది:21-11-22 సెల్: 9848422155

పబ్లిక్ నోటీసు

In the Court of the Senior Civil Judge at Kaikalur
H.M.O.P. No. 91/2021

Between:
Baswani Ramesh ...*Petitioner*
AND
Baswani Lakshmi ...*Respondent*
To:
Baswani Lakshmi, W/o. Ramesh, D/o. Revu Arjuna Rao, R/o. Kondangi Pallipalem Village of Kalidindi Mandal, Eluru District, Kaikalur PJCJC.

పై నెంబరు పిటీషన్‌ను పిటీషనరు రెస్పాండెంటుపై విడాకుల నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో శ్రీ కోర్టు వారి నుండి ఎన్నిసార్లు పిటీషన్ నోటీసులు పంపిననూ రెస్పాండెంటు పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున పబ్లికేషన్ ద్వారా నోటీసులు అమలుకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. సదరు ఉత్తర్వుల ప్రకారం మీరు **ది. 21-12-2022వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు నందు స్వయముగా గానీ, వకీలు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలున్న తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తదుపరి ఉత్తర్వులు పొందబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది: 21-12-2022

శ్రీ పి.పవన్‌కాంత్
పిటీషనరు తరుపు న్యాయవాది
సెల్: 9490339161

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 928/2022, O.S. 472/2022

Between:
పిటీషనరు/వాది: అడ్డాల నాగేశ్వరరావు
AND
రెస్పాండెంట్/ప్రతివాది: జయవరపు సుబ్రమణ్యం, హిందు, పురుషుడు, 34 సం॥లు, వ్యాపారం, S/o. సత్యసాయిబాబ, డో.నెం. 4-57/1, వినాయక గుడి వద్ద, సిద్ధాంతం, పెనుగొండ మండలం, W.G.Dist., (AP), TDMC.

పిటిషనరు/వాది తరపు దాఖలు చేసిన పేపరు ప్రకటన

పై నెంబరు గ్రంథము **ది. 16-12-2022వ తేదీ వాయిదా అయి వున్నది.** సదరు గ్రంథములో రెస్పాండెంట్/ప్రతివాదికి I.A. 928/2022 మరియు దావాలోను ఎన్నిసార్లు నోటీసు సమన్లు పంపినప్పటికి రెస్పాండెంట్/ ప్రతివాది సదరు నోటీసు దావా సమను తీసుకోకుండ Avoid అగుచున్నందున పై పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చుడమైనది. సదరు తేదీన రెస్పాండెంట్/ప్రతివాది స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని **ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు కావలసి వున్నది. లేని ఎడల మీపై పరోక్షముగా తీర్మానించబడును అని యిందు మూలముగా మీకు తెలియచేయడమైనది.

మంగిన శ్రీనివాస మెహర్‌బాబా
తణుకు అడ్వకేట్, తణుకు
ది.21-11-2022 సెల్: 7013318947

వేలం ప్రకటన

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
ఇ.పి. నెం. 29/2021
ఇన్
ఓ.ఎస్. నెం. 115/2016

బిట్వీన్:
శ్రీ తానాటి రమేష్ ***-డిక్రీ హోల్డర్/వాది***
అండ్
శ్రీమతి పులి ధనలక్ష్మి
-జడ్జిమెంట్ డెటార్/ ప్రతివాది

పై నెంబరు గ్రంథములో డిక్రీ హోల్డర్, డిక్రీ బాకీ వసూలు నిమిత్తం, ఈ క్రింది ఉదహరించిన ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తి జె.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములు గల స్థిరాస్తి అయి వున్నది. ఈ స్థిరాస్తిని కోర్టు వారు **ది. 16-12-2022వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై ఉదహరించిన కోర్టులో బహిరంగ వేలం వేయుదురు. కాబట్టి యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకోవచ్చును.

షెడ్యూలు ఆస్తి వివరము

పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు సబ్.డి., ఏలూరు మండలం, జాలిపూడి గ్రామపంచాయితి, జాలిపూడి గ్రామంలోని జిరాయితి పల్లం ఆర్.యస్. నెం. 294/1రు య. 0-63 సెంట్లు అనగా 0.255 హెక్టార్ల భూమికి హద్దులు.
తూర్పు: పులి నాగేశ్వరరావు వగైరాల భూమిలో నుండి వెళ్ళు కాలువ. **దక్షిణం:** గోగు వీరభద్రరావు గారి భూమి. **పడమర:** పులి శ్రీనివాసరావు గారి భూమి. **ఉత్తరం:** పంట బోదె.
ఈ హద్దుల మధ్య య. 0.63 భూమిని వేలం వేయుదురు.
డి. హెచ్.ఆర్. విలువ: రూ. 12,00,000=00
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

టి.జగన్‌మోహన్, అడ్వకేట్
ఏలూరు, సెల్: 8247533188